క్లుప్తంగా

ముగిసిన భరద్వాజ జయంతి ఉత్సవాలు



అలంకరణలో స్వామివారి సమాధి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కొలువైన శ్రీపాలికి వరచితంబరస్వామి సన్నిధిలో గత రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్న భరద్వాజ్ మాస్టర్ జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భరద్వాజ్ చిత్ర పటానికి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పారాయణాలు, వక్తల సత్సంగాలు, భజనలు, పూజలు, అభిషేకాలు, అర్చనలు మంగళ హారతులు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

మహాసభలను విజయవంతం చేయండి



కర పత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 10, 11 తేదీల్లో పట్టణంలో జరిగే సీపీఎం పట్టణ, మండల మూడవ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో బుధవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలపై సీపీఎం పోరాడుతోందన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, మేధావులు అధిక సంఖ్యలో వచ్చి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కొండన్న, భాస్కర్ రెడ్డి, చిన్న రహిమాన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు 15 వరకు అవకాశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

బేతంచెర్ల : ఉపాధి హామీ పథకం కింద చిన్న, సన్న కారు రైతులు 5 ఎకరాల లోపు పండ్ల తోటల సాగుకు నవంబర్ 15 వరకు అవకాశం ఉందని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలానికి 18 గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామీణ పార్కుల ఏర్పాటుకు గ్రామాల్లో అర్ధ ఎకరానుంచి, ఎకరా స్థలం గుర్తించాలన్నారు.

గోవుల తరలింపు



గోవులను తరలిస్తున్న దృశ్యం

బనగానపల్లె : పట్టణంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న గోవులను బుధవారం ప్రత్యేక వాహనంలో యాగంటి బసవన్న గోశాలకు తరలించారు. గోవులను ఇంటి వద్దనే ఉంచుకోవాలని రెండువారాలుగా దండోరా వేయించినా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీంతో గోవులను గోశాలకు తరలిస్తున్నామని చెప్పారు. వీధుల్లో రాకపోకలకు ఇబ్బందులు కలిగించే గోవులను గోశాలకు తరలిస్తామని, యామన్యాలు వాటిని ఇళ్ల వద్దనే ఉంచుకోవాలని ఏఓ సూచించారు.

పేదలకు టార్పాలిన్‌ల పంపిణీ



టాలిన్‌లు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని పెండేకంటినగర్ బుడగ జంగాల కాలనీ గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, మండల చైర్మన్ సైపుల్లాల ఆధ్వర్యంలో టార్పాలిన్‌లు పంపిణీ చేశారు. సంచార జీవితం గడిపే పేదలు ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, తమవంతుగా టార్పాలిన్‌లు అందజేశామని వారు చెప్పారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు హనుమంతు, జహీర్‌బాషా, దాదాపీర్, కో ఆర్డినేటర్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకం.. శుభకరం

- 2 నుంచి కార్తీక మాసం ప్రారంభం
- నాలుగు వారాల పాటు ప్రత్యేక పూజలు
- ముస్తాబవుతున్న ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో నేలబెలుం మల్లేశ్వరస్వామి



బందార్లపల్లె సమీపంలోని నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయం



యాగంటి ఆలయ ముఖద్వారం

కొలిమిగుండ్ల: శుభకరమైన కార్తీక మాసం నవంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభ కానుంది. స్నాన, దాన, జపాలు, పూజలు, ఉపవాస వ్రతాలు, దీపాలు వెలిగించడం, వనభోజనాలు చేయడం వలన జన్మ జన్మల పాపాలను ప్రక్షాళన చేసి పుణ్యఫలాలను ప్రసాదించే మహిమాన్వితమైనది మాసం కార్తీక మాసం. శివునికి ప్రీతికరమైన మాసం కార్తీక మాసం. ప్రతి ఏటా దీపావళి మరుసటి రోజు నుంచి అతి పవిత్రమైన కార్తీక మాసం ఆరంభమవుతుంది. ఈమాసంలో భక్తులు నిత్యం పరమశివుని నామాన్ని జపిస్తారు. పురాణం నుంచి ఈమాసానికి ప్రత్యేకత సంతరించుకుంది. హరిహరాదులకు ప్రీతి పాత్రమైన మాసంలో భక్తులు నియమ నిష్టలతో చేసే నోములకు ఎంతో ప్రాధాన్యం ఉంది. శివపార్వతుల అనుగ్రహం కోసం మహిళలు పూజలు చేస్తుంటారు. భారతీయ సంస్కృతిలో కార్తీక మాసం అంటే నెల రోజుల పాటు పండుగ దినాలే. కార్తీక మాసం ఈశ్వరాధనకు చాలా ముఖ్యమైంది. ఈమాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యముంది. దీపారాధన శుభఫలితాలు కలుగజేయడమే కాక ఆరోగ్య భాగ్యాలను ఇస్తుందని భక్తుల నమ్మకం. కార్తీక సోమవారాల్లో వెలిగించే కార్తీక దీపాలు, ఉసిరి చెట్టు కింద పూజలు, వనభోజనాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వేదపండితులు అభిప్రాయపడుతున్నారు. నాలుగు వారాల పాటు శివాలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. ఇప్పటికే పలు చోట్ల ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు.

దీపారాధనకు ప్రత్యేకత

కార్తీక మాసంలో దీపారాధన వెలిగించడం ప్రధాన ఘట్టం. సూర్యోదయానికి ముందే కార్తీక స్నానాలు చేసి పొడి దుస్తులు ధరించి దీపారాధన వెలిగించడం వలన పుణ్యఫలాలు ప్రాప్తిస్తాయని భక్తుల నమ్మకం. ఒక్కో రకమైన ప్రమిదల దీపం వెలిగిస్తే ఒక్కో రకమైన మంచి జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. మట్టి ప్రమిదలో వెలిగిస్తే దైవానుగ్రహం కలుగుతుంది. పింగాణి ప్రమిదలో దీపం వెలిగిస్తే ఆ ఇంటి వారికి అలంకరణ వస్తువులు సమకూరుతాయి. ఇత్తడి ప్రమిదలో వెలిగిస్తే ఆ ఇంట్లో దైవ శక్తి అధికమవుతుంది. నిమ్మ ప్రమిదల్లో వెలిగిస్తే చేపట్టిన అన్ని కార్యాయాల్లో విజయం సిద్ధిస్తుంది. అరటి దోసెలో దీపం వెలిగించి నీటిలో వదిలితే మానసిక సంతృప్తి, ధనరక్షణ కలుగుతుంది. అదేవిధంగా ఉసిరి కాయల దీపం వెలిగిస్తే పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

శైవక్షేత్రాలు ముస్తాబు

కార్తీక మాసం సమీపిస్తుండటంతో నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో శ్రీశైలం,మహానంది తర్వాత యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. కార్తీక మాసంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. లక్షదీపారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా కొలిమిగుండ్ల మండలంలో బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణ బ్రహోత్సవాలు కార్తీక మాసంలో ఘనంగా జరుగుతాయి. కడసోమవారం రోజు పెద్ద ఎత్తున తిరునాల మహోత్సవం జరుగుతుంది. శ్రీచక్ర రూపంలో పాణిమట్టంపై సాలగ్రామం రూపంలో స్వామి కొలువై ఉన్నాడు. సంజామల మండలంలోని నయనాలప్ప క్షేత్రంలోని ఓంకారేశ్వరుడి ఆలయంలో కార్తీక మాసంలో పూజలు పెద్ద ఎత్తున జరుగుతాయి.

అనాదిగా వస్తున్న ఆచారం



కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం అనాదిగా వస్తున్న ఆచారం. వీటికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. శరీరానికి రక్షణగా నిలుస్తాయి. దీపాలు వెలిగించడం వలన దేవాలయాల విశిష్టత పెరుగుతుంది. సాయంత్రం అయితే ఆలయాల్లో దీపాలు వెలిగించేవాళ్లు. పూర్వం రవాణ సాధనాలు లేక పోవడంతో పాదచారులు వెళ్తున్న సమయంలో దీపాలు చూసి గుడి ఉందని గుర్తించి అక్కడ విశ్రాంతి పొందేవాళ్లు. కార్తీక మాసం పూజలున అన్నివిధాల శుభకరం సిద్ధిస్తుంది.

– ఆలూరి రాఘవేంద్రప్రసాద్, వేదపండితులు

అంగన్‌వాడీ పోస్టులకు 6న ఇంటర్వ్యూలు

డోన్ రూరల్ : అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి నవంబర్ 6వ తేదీన డోన్ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

మద్యం ధరలపై గొప్పలు చెప్పకోవడం సిగ్గు చేటు



మాట్లాడుతున్న కె.రాధాకృష్ణ

డోన్ రూరల్ : ప్రజల నిత్యావసర ధరలు తగ్గించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాధాకృష్ణ మండిపడ్డారు. పట్టణంలోని స్థానిక నక్కిరామన్న భవనంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు విజయుడు ఆధ్వర్యంలో జనర్‌బాడీ సమావేశం నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఆర్థికంగా చితికిపోయారని, సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలన్నారు. పేదలపై విద్యుత్ చార్జీలు పెంచకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోటారాముడు, కార్యవర్గ సభ్యులు పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

2న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో వెలసిన వాల్మీకి గుహల వద్ద నవంబర్ 2 వ తేదీన మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు మండల వాల్మీకి సోదరులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాల్మీకి గురుపీఠం పీఠాధిపతి పరమపూజ్య జగద్గురు వాల్మీకి ప్రసన్నానందపురి మహాస్వామి హాజరవుతారన్నారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

జయప్రదం చేయండి

డోన్ టౌన్ : ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లి గ్రామ సమీపంలోని వాల్మీకి గుహలలో నవంబర్ 2న నిర్వహించనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రతి వాల్మీకి సోదరుడు తరలివచ్చి విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ కార్యాలయంలో సంఘం నాయకులు భాస్కర్‌నాయుడు, యర్రగుంట్ల వెంకటేశ్వర్లు, మేకల నాగరాజు, నాగేంద్ర, రాంపల్లె, శ్రీను తదితరులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. అనంతరం ప్రతిష్ఠకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. 2వ తేదీ ఉదయం 7గంటలకు రైల్వే స్టేషన్ రోడ్డులోని లోటస్ లాడ్జి వద్దకు తరలిరావాలని కోరారు. అక్కడి నుంచి వాల్మీకి గుహలకు వాహనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వాల్మీకి నాయకులు

సుమోటోగా తీసుకొని దర్యాప్తు చేయాలి



మాట్లాడుతున్న నాగరాజు

డోన్ టౌన్: ప్రైవేట్ రుణ యాప్‌ల యజమానుల ఒత్తిళ్లకు తాళలేక మంగళవారం నంద్యాలకు చెందిన ఫరూక్ రైలు కింద పడి ఆత్మ హత్య చేసుకున్న కేసును ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏతు నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహ ఆవరణలో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. గతంలో కూడా ఈ రుణ యాప్ ఒత్తిళ్లకు యువత, నిరుద్యోగులు, పేదలు అనేక మంది బలవన్మరణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, మన జిల్లా మంత్రులు స్పందించి ప్రైవేట్ రుణ యాప్‌లను రద్దు చేసి పేదలకు విముక్తి కల్పించాలన్నారు. సమావేశంలో సామాజిక కార్యకర్తలు మధు శేఖర్, ఓంప్రకాష్ నారాయణ, మనోజ్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

పెండింగ్ వసతి, విద్యాదీవెన విడుదల చేయాలి

బనగానపల్లె రూరల్ : పెండింగ్‌లో ఉన్న వసతి, విద్యా దీవెన నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నెరవాటిరాజా ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నెరవాటిరాజా మాట్లాడుతూ ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వెంటనే అమలు చేయాలని, జీవో నం 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మంజులారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎఫ్ఐ నాయకులుక సతీష్,వేణు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు



ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

ప్రజా సమస్యలపై స్పందించండి

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జనార్దన్ రెడ్డి

అవుకు: మండలంలోని ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. మండల కేంద్రం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. అనంతరం అవుకు సామాజిక వైద్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణం పరిశుభ్రంగా ఉందని వైద్య బృందాన్ని బీసీ అభినందించారు. తదనంతరం ఎస్సీ కాలనీలో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు చల్లా విజయభాస్కర్ రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, ఉగ్రసేనా రెడ్డి, రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్‌ఆర్‌బీసీ తూము !

బనగానపల్లె : ఎస్‌ఆర్‌బీసీ 9వ బ్లాక్ పరిధిలో మిట్టపల్లి గ్రామ సమీపంలో ఎస్‌ఆర్‌బీసీ సబ్ కాల్వకు చెందిన తూము శిథిలావస్థకు చేరింది. దీంతో ఆయకట్టుకు సాగునీరందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తూము నుంచి కైప, కాపులపల్లి మిట్టపల్లి గ్రామాలకు చెందిన సుమారు 6వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ తూమును పట్టించుకోకపోవడంతో పూర్తిగా పాడైపోయింది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్య పరిష్కార చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



దెబ్బతిన్న తూము

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

బేతంచెర్ల : విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల నుంచి వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకొని ధర్నా చేశారు. అనంతరం డీటీ మారుతికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే విద్యారంగాన్ని ప్రక్షాళన చేసే బాధ్యత తీసుకుంటామని యువగళం పాదయాత్రలో నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా విద్యార్థులకు ఇచ్చిన హామీల ఊసేలేదన్నారు.

బాణాసంచా దుకాణాల ఏర్పాటు

బేతంచెర్ల : దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలోని ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ స్థలంలో 9 బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలు కాల్చే క్రాకర్స్, చిచ్చు బుడ్లు మొదలుకొని వివిధ రకాల టపాసులను నిర్వాహకులు అమ్మకానికి ఉంచారు.

నేడు వేలం పాట

కొలిమిగుండ్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బందార్లపల్లె సమీపంలోని నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం టెంకాయల విక్రయానికి సంబంధించి వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేలంపాట దక్కించుకున్న వ్యక్తులు కార్తీక మాసం నాలుగు వారాల పాటు ఆలయ ఆవరణలో టెంకాయలను దేవస్థానం నిర్ణయించిన ధరకు విక్రయించుకోవాల్సి ఉంటుందన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



రక్తదానం చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్ : అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీసుశాఖ ఆధఅవర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని యూనియన్ క్లబ్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆయన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపనే ధ్యేయంగా పని చేస్తూ దుండగుల చేతిలో తూటాలకు బలైన వారు, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం అర్పించిన వారి త్యాగ ఫలాలే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అన్నారు.

విశేష స్పందన

మెగా రక్తదాన శిబిరానికి పోలీసు శాఖతో పాటు వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యార్థి సంఘాల నుంచి విశేష స్పందన లభించింది. డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, పౌరులు దాదాపు 280 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని డీఎస్పీ శ్రీనివాసులు ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐలు రాకేష్, ఇంతియాజ్‌బాషా, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందన

బేతంచెర్ల : రక్తదాన శిబిరంలో మండలంలోని రెడ్ క్రాస్ సభ్యులు, గ్రామీణ వైద్యులు రక్తదానం చేశారు. సీఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలను, పోలీస్ సిబ్బంది ని సీఐ, ఎస్ఐ రమేష్ బాబు అభినందించారు. రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగ సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా టపాసుల విక్రయాలు

బనగానపల్లె రూరల్ : దీపావళి పర్వదినం పురస్కరించుకొని బనగానపల్లె పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల స్టాల్స్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యంగా విక్రయాలు కొనసాగుతున్నాయి. తాత్కాలికంగా స్టాల్స్ ఏర్పాటుకు 8 మంది స్థానిక అధికారుల నుంచి అనుమతి పొందారు. బుధవారం వీరు జీఎం టాకీస్ సమీపంలో ఓకే చోట స్టాల్స్ ఏర్పాటు చేశారు. అయితే ఏ ఒక్కరూ కూడా టాపాసుల ధరల పట్టి పెట్టక పోవడంతో కొనుగోలుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధరలు ఇష్టారాజ్యంగా పెంచారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధరల నియంతణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



టపాసుల విక్రయ స్టాల్స్ వద్ద ధరల పట్టిలేని దృశ్యం

డ్రోన్‌తో మందు పిచికారీ



కంది పంటకు మందును డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల : మారుతున్న కాలనుగుణంగా వ్యవసాయంలో సైతం సాంకేతిక చోటు చేసుకున్నాయి. విత్తనాలు మొదలుకొని, తొలగింపు, నూర్పిడి వరకు యంత్రాలు వచ్చేశాయి. ఇందులో భాగంగా పైర్ల సంరక్షణకు మందును డ్రోన్ల సహాయంతో పిచికారీ చేస్తున్నారు. బేతంచెర్ల మండలంలో కంది పంట పూత దశలో ఉండగా ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో ఓ రైతు డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేయించాడు. సాధరణంగా ఓ రైతు రోజుకు 6 నుంచి 7 ఎకరాల వరకు మందును పిచికారీ చేస్తాడు. డ్రోన్ సహాయంతో ఒక రోజు 20 ఎకరాల వరకు మందు కొట్టవచ్చని రైతు తెలిపాడు.

ఆలయానికి క్యారీబ్యాగ్‌ల విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయానికి బనగానపల్లె కెనరా బ్యాంకు శాఖ మేనేజర్ అంకన్న... స్వామివారి వివరాల ప్రింట్‌తో తయారు చేసిన 100 కేజీల క్యారీ బ్యాగ్‌లను ఈఓ చంద్రుడుకు బుధవారం అందజేశారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంతకుమార్‌తోపాటు స్థానిక అధికారులకు ఈఓ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్‌శర్మ,బండి మౌలీశ్వరరెడ్డి తదితర ఆలయ సిబ్బంది పాన్నారు.

జిల్లెల్లలో గ్రామసభ

బనగానపల్లె రూరల్ : రీ సర్వే సమస్యల పరిష్కారానికి బుధవారం మండలంలోని జిల్లెల్లలో రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన మండల సర్వేయర్ గీతాభవాని, ఆర్ఐ రఘువేంద్ర రైతుల నుంచి వినతులు స్వీకరించారు. వినతులను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు మహేశ్వరరెడ్డి, విలేజ్ సర్వేయర్లు భాస్కర్, సుబ్రహ్మణ్యం, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు





